

నలుగురు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలను కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సీనియర్ ఐఏఎస్ డాక్టర్ శాలిని రజనీశ్‌కు రాకేశ్‌సింగ్ పదవీ విరమణతో అదనపు ముఖ్యకార్యదర్శి బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆమె అదనపు ముఖ్యకార్యదర్శితోపాటు డెవలెప్‌మెంట్ కమిషనర్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఉమాశంకర్‌కు బెంగళూరు నగరాభివృద్ధి అదనపు ముఖ్యకార్యదర్శి బాధ్యతలను, గౌరవ్‌గుప్తకు జలవనరులశాఖ అదనపు ముఖ్యకార్యదర్శి హోదాను, రశ్మి మహేశ్‌కు ఎగువసభ న్యాయమండలి అధ్యక్ష హోదాలను కల్పించారు.



సిట్ అధికారుల వాహనంలో ప్రజ్వల్

నెల రోజుల ఉత్కంఠకు తెర



- బెంగళూరులో దిగిన 20 నిమిషాల్లోనే ప్రజ్వల్ అరెస్టు
- ఈ నెల 6వరకు సిట్ కస్టడీకి కోర్టు అనుమతి
- రేవణ్ణ కుటుంబం చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): నెలరోజులుగా రకరకాల ట్విస్టులు.. అనేక మలుపులు.. అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్లు సాగిన ప్రజ్వల్ రేవణ్ణ వ్యవహారానికి ఎట్టకేలకు శుక్రవారం తెరపడింది. హాసన్ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలలు వెలుగుచూసిన తర్వాత తొలివిడత లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగిన రోజే జర్మనీకి వెళ్లిన విషయం తెలిసిందే. నెలరోజులకుపైగా సాగిన ఉత్కంఠకు తెరదించేలా ప్రజ్వల్ రేవణ్ణ బెంగళూరుకు వెనుతిరిగి వచ్చారు. జర్మనీ నుంచి గురువారం అర్ధరాత్రి 1 గంటకు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోగా అప్పటికే భారీ బందోబస్తుతో సిట్ అధికారులు విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానం దిగిన ప్రజ్వల్ ఇమ్మిగ్రేషన్ విభాగంలో పాస్‌పోర్ట్‌లో సీల్ వేయించుకునేందుకు వెళ్లగా అప్పటికే సిట్‌కు చెందిన మహిళా అధికారులు అరెస్టుకు సిద్ధమయ్యారు. బెంగళూరులో దిగిన ప్రజ్వల్‌ను 20 నిమిషాల్లోనే అరెస్టు ప్రకటించారు. మహిళా అధికారులు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించగా తనను ఎవరు తాకొద్దని, మీ వెంట వస్తానని అన్నారు. అక్కడి నుంచి విధానసౌధ సమీపంలోని సీఐడీ కార్యాలయానికి మహిళా అధికారులే తీసుకొచ్చారు. తెల్లవారుజామున 3 నుంచి 6 దాకా విశ్రాంతి ఇచ్చారు. మరోసారి అధికారులు చేరుకుని తదుపరి చర్యలకు సిద్ధమమయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సీఐడీ అధికారులు నేరుగా ప్రజ్వల్‌ను శివాజినగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు జరిపి 42వ ఏసీఎంఎం కోర్టు ముందు హాజరు పరిచారు. ఇటు సిట్, అటు ప్రజ్వల్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. సిట్ అధికారులు 14 రోజుల కస్టడీ కోరగా ప్రజ్వల్ తరపు న్యాయవాదులు ఒకరోజు కస్టడీకి ప్రతిపాదించారు. చివరకు న్యాయాధికారి జూన్ 6వరకు కస్టడీకి ఆదేశించారు.

ప్రజ్వల్ ముందు అన్నీ సవాళ్లే ..

రాసలీలల వివాదంలో ఆరు రోజుల సిట్ కస్టడీకి చేరిన ప్రజ్వల్ ముందు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం ఎంపీగా ఉన్న ప్రజ్వల్ వద్దకు వెళితే లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారనేది ప్రధానమైన ఆరోపణ. ప్రస్తుతానికి ఓ మహిళ మాత్రమే ఫిర్యాదు చేయగా మరింతమంది సిట్ అధికారులకు ఫోన్లు, ఇతర్రత్రా సమాచారంతో జరిగిన సమస్యను వివరించినట్లు తెలుస్తోంది. లైంగిక చర్యలకు పాల్పడి వీడియోలు ఎందుకు రికార్డు చేసినట్లు, వాటి వెనుక వ్యూహం ఏమిటనేది సిట్ అధికారులు ఆరా తీయనున్నారు. ఎప్పటి నుంచి ఈ ప్రక్రియ సాగింది, ఎలా బహిర్గతమయింది అనే అంశాలపై ప్రశ్నిస్తారని తెలుస్తోంది. మొబైల్‌లోని వీడియోలు పెన్‌డ్రైవ్‌లుగా ఎలా మారాయనేది కూడా కీలకమే. ఎంతమంది వీడియోలు ఉన్నాయి. ఏ విధంగా వారిని మీ వద్దకు రప్పించుకున్నారనేది ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. నెలరోజులపాటు ఎక్కడ గడిపారు, మీతో పాటు ఎవరు ఉన్నారు, ఇక్కడి సమాచారం మీకు తెలుస్తోందా..? అది ఏ విధంగా..? ఎవరెవరితో ఫోన్‌లో సంప్రదించారనేది ఆరా తీస్తారని సమాచారం. నెల రోజులపాటు నగదు లావాదేవీలు ఎలా చేశారు..? కుటుంబ సభ్యులతో మాట్లాడారా..? అనే అంశాలు కూడా అడుగుతారని తెలుస్తోంది. ఐదుసార్లు టిక్కెట్ ఎందుకు రద్దు చేసుకున్నారు. ఎవరైనా సూచించారా..? ఎవరు మీకు టిక్కెట్లు సమకూర్చేవారు.. మీతోపాటు ఎవరైనా జర్మనీలో ఉండేవారా..? అనే ప్రశ్నలు కీలకం కానున్నాయి. ప్రజ్వల్ ఫోన్ గతంలో వాడుతున్నదేనా..? లేదా మార్పు చేశారా..? ఒకవేళ మార్చి ఉంటే పాత ఫోన్ ఏమైందనే ప్రశ్నలు కూడా కీలకం కానున్నాయి.

నెలరోజుల ఉత్కంఠ

లోక్‌సభ ఎన్నికలకు ముందే రాసలీలల పెన్‌డ్రైవ్‌లు బహిర్గతమైనా పోలింగ్ జరిగిన ఏప్రిల్ 26వ తేదీ రాత్రి ప్రజ్వల్ జర్మనీకి వెళ్లారు. ఆ తర్వాత రెండు రోజులకే రేవణ్ణ ఇంట్లో గతంలో పనిమనిషిగా ఉన్న బాధితురాలు మైసూరు జిల్లా కేఆర్ నగర పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం వెలుగుచూసింది. ఈలోగానే ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన పెన్‌డ్రైవ్‌లు వందలసంఖ్యలో హాసన్‌లో వెలుగులోకి రావడం, దుర్మార్గమైన అత్యాచారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రజ్వల్‌కు నోటీసులు జారీ చేసి వెంటనే సిట్‌ముందు హాజరు కావాలని సూచించగా న్యాయవాదుల ద్వారా వారం రోజుల గడువు కోరారు. ఆ తర్వాత ఆచూకీ లేకుండాపోయారు. బాధితురాలిని కిడ్నాప్ చేయించడంతో ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ, తల్లి భవానిలపై కేసులు నమోదయ్యాయి. రేవణ్ణను అరెస్టు చేయగా వారం రోజుల తర్వాత కండీషన్ బెయిల్‌పై బయటకు వచ్చారు. ప్రజ్వల్ ఆచూకీ కోసం సిట్ అధికారులు పకడ్బందీగా వ్యవహరించారు. లుక్‌అవుట్ నోటీసులు జారీ చేయడం, బ్లూకార్నర్ నోటీసులు సీబీఐ ద్వారా ఇప్పించడం, మరోవైపు నిర్లక్ష్యంపై కోర్టు ద్వారా నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ అయ్యింది. ఈలోగా సీఎం సిద్దరామయ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రజ్వల్ డిప్లమాటిక్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేయించాలని లేఖలు పంపారు. ప్రజ్వల్‌కు అన్నివైపులా దారులు మూసుకుపోయేలా చేశారు. దీంతో విధిలేకనే ప్రజ్వల్ వెనుతిరిగినట్లు తెలుస్తోంది.



ఎయిర్‌పోర్ట్ నుంచి బయటికి వస్తున్న ప్రజ్వల్

మహిళా పోలీసులతోనే అరెస్టు

రాసలీలల వివాదంలో ఇరుక్కున్న ఎంపీ ప్రజ్వల్‌కు సిట్ అధికారులు అరెస్టు నుంచి కస్టడీ దాకా మహిళా పోలీసుల ద్వారానే ప్రక్రియ సాగించారు. మహిళలంటే ఏమైనా సాధించగలరని నిరూపించేలా వ్యవహరించారు. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎయిర్‌పోర్ట్‌లో ప్రజ్వల్‌ను అరెస్టు చేసినపుడు ఓ ఎస్‌ఐతోపాటు నలుగురు మహిళా అధికారులు ఉన్నారు. అక్కడి నుంచి సిట్ కార్యాలయానికి తరలించింది కూడా వారే. ఆసుపత్రికి తరలించడం, అక్కడి నుంచి కోర్టుకు, ఆ తర్వాత జూన్ 6వరకు కస్టడీ విధించడంతో సిట్ కార్యాలయానికి మహిళా అధికారులే తీసుకొచ్చారు.



పోలీస్ వాహనాల్లో తరలిస్తూ..

ఏ క్షణంలోనైనా మంత్రి నాగేంద్ర రాజీనామా..?

- ఇప్పటికే సీఎం సూచించినట్లు సమాచారం
- అందుబాటులో లేని మంత్రి



బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలకు సంబంధించి ఎస్టీ అభివృద్ధిశాఖ మంత్రి నాగేంద్ర రాజీనామా అనివార్యం కానున్నట్లు తెలుస్తోంది. ఏక్షణంలోనైనా మంత్రి నాగేంద్ర రాజీనామా చేసే అవకాశాలు ఉన్నాయని సమాచారం. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.87 కోట్ల అవినీతి జరిగిందని, అకౌంటెంట్ చంద్రశేఖర్ డెత్‌నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. డెత్‌నోట్‌లో అధికారుల పేర్లు ప్రస్తావించిన మేరకు అందులో మంత్రికి భాగస్వామ్యం ఉందని ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులుగా నిరసనలు కొనసాగిస్తోంది. జూన్ 6లోగా మంత్రి రాజీనామా చేయకుంటే రాష్ట్రమంతటా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించింది. మంత్రి నాగేంద్ర కూడా కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని, విచారణలో ఎవరు బాధ్యులైనా చర్యలు తప్పవని ప్రకటించారు. తాను రాజీనామా చేసేది లేదని తేల్చిచెప్పారు. మూడు రోజులపాటు ఢిల్లీలో గడిపిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ సందర్భంగా కార్పొరేషన్‌లో అవినీతి అంశం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి చేత రాజీనామా చేయిస్తామని, విచారణలో నిర్దోషిగా తేలితే ఆయనకు మరో అవకాశం ఇస్తామని స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదే విషయాన్ని సీఎం సిద్దరామయ్య మంత్రి నాగేంద్రకు గురువారం సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుబాటులో లేని నాగేంద్ర ఏక్షణంలోనైనా బెంగళూరుకు వెనుతిరిగి వచ్చి రాజీనామా చేసే అవకాశం ఉంది. మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ. 85 కోట్ల అవినీతి చోటు చేసుకుంది. మార్చి నెలలో కార్పొరేషన్‌కు అనుబంధమైన బ్యాంకు ఖాతాల నుంచి పలువురి అకౌంట్లకు బదిలీ చేశారు. కర్ణాటకలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్యాంకు ఖాతాలకు జమ అయినట్లు ప్రతిపక్షాలు ఆరోపించాయి. వీటన్నింటి నేపథ్యంలో ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా ప్రారంభంలోనే కట్టడి చేయదలిచిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య మంత్రి నాగేంద్రకు సూచించినట్లు సమాచారం. ఢిల్లీ నుంచే సీఎం ఆదేశించడంతో నాగేంద్ర రాజీనామా అనివార్యమవుతోంది. శుక్రవారం సాయంత్రం దాకా నాగేంద్ర అందుబాటులో లేకుండా పోయారు. దీన్నిబట్టి మంత్రి నాగేంద్ర ఏక్షణంలోనైనా రాజీనామా చేయవచ్చునని తెలుస్తోంది. సిద్దరామయ్య ఏడాది పాలన ముగిసిన తరుణంలో తొలి వికెట్‌గా నాగేంద్ర రాజీనామా కానున్నట్లు సమాచారం.

భవాని బెయిల్ పిటిషన్ తిరస్కరణ

ప్రజ్వల్ అరెస్టుతో తల్లి భవాని, తండ్రి రేవణ్ణకు ఉచ్చు బిగుస్తోంది. కుటుంబీకులు అందరికీ ఒక్కసారిగా షాక్ తగలనుంది. మైసూరులోని కేఆర్‌పేటలో బాధితురాలి కిడ్నాప్ కేసుకు సంబంధించి భవాని దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణలు ముగిశాయి. శుక్రవారం సదరు పిటిషన్‌ను సదరు 42వ ఏసీసీఎం కోర్టు తిరస్కరించింది. మరోవైపు శనివారం విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. బెయిల్ పిటీషన్ తిరస్కరణకు గురి కావడంతో విచారణకు వెళ్తే అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు రేవణ్ణకు మంజూరు చేసిన కండీషన్ బెయిల్‌ను రద్దు చేయాలని సిట్ అధికారులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్. దీక్షిత్ ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. బెయిల్ మంజూరు చేసిన ఆదేశాలలో న్యాయ నిబంధనలు తప్పుగా వ్యాఖ్యానించారని మౌఖికంగా తెలిపారు. వాదనలు వినేందుకు ఇదే సరైన సమయమని నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. దీంతో రేవణ్ణకు ఆందోళన మొదలైంది. ఇలా ఒక్కసారిగా కుటుంబీకులందరికీ ఉచ్చు బిగించినట్టయ్యింది.

సిట్ కస్టడీకి అబ్బాయి.. విహారానికి బాబాయి..!

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): అన్న కుమారుడు ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జర్మనీ నుంచి రావడం.. పోలీసులు అరెస్టు చేయడం.. కోర్టు ముందు హాజరు పరచడం.. కోర్టు సీఐడీ కస్టడీ ఆదేశించడం.. శుక్రవారం ఒకవైపు హాట్‌హాట్‌గా జరుగుతుంటే.. అదే సమయంలో ప్రజ్వల్ బాబాయి, మాజీ సీఎం కుమారస్వామి కుటుంబీకులతో కలసి విహార యాత్రకు వెళ్లారు. నాగరహోళె సమీపంలోని కబిని జలాశయం బ్యాక్‌వాటర్‌కు అనుబంధంగా ఉండే ఆరెంజ్ కౌంటీ రిసార్టుకు వెళ్లారు. భార్య అనిత, కుమారుడు నిఖిల్, కోడలు రేవతితోపాటు మనవడితో కలసి బ్యాక్‌వాటర్‌లో బోటింగ్ చేస్తున్న ఫొటోలను కుమారస్వామి శుక్రవారం విడుదల చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ముందు రోజు దాకా కుమారస్వామి అక్కడే గడపనున్నట్లు సమాచారం. అతడిని వారం రోజులకస్టడీకి తీసుకున్నారు. కుమారస్వామి రిసార్టుకు వెళ్లడంపై సర్వత్రా భిన్నమైన చర్చలు సాగుతున్నాయి.



బోటింగ్‌లో కుమారస్వామి, భార్య, పిల్లలు



బాధితులు ధైర్యంగా ముందుకు రండి : హోంమంత్రి

ఈ వివాదంలో బాధిత మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ పిలుపునిచ్చారు. ప్రజ్వల్‌ను అరెస్టు చేశామని, ఎటువంటి భయం అవసరం లేదని పోలీసులు అండగా ఉంటారని పేర్కొన్నారు. బాధితులు ముందుకొచ్చి ఎదుర్కొన్న సమస్యలు వివరించాలన్నారు. నేరుగా లేదా హెల్ప్‌లైన్ ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చు అన్నారు. ప్రజ్వల్ ఫోన్ పోగొట్టుకున్నట్లు జరుగుతున్న ప్రచారంపై హోంమంత్రి మీడియాతో స్పందిస్తూ ఇంకా విచారణలు ప్రారంభం కాలేదన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై సిట్

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి వ్యవహారంపై ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని, అందుకు ఎటువంటి సంబంధంలేకున్నా వేధిస్తున్నారని అకౌంటెంట్ చంద్రశేఖర్ ఆత్మహత్యతో వివాదం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నలుగురు పోలీసు ఉన్నతాధికారులతో సిట్‌ను ఏర్పాటు చేసింది. సీఐడీ విభాగం అదనపు డీజీపీ మనీశ్ తర్బేకర్ ముఖ్యులుగా వ్యవహరించనుండగా దక్షిణ విభాగం ట్రాఫిక్ డీసీపీ శివప్రకాశ్ దేవరాజ్, ఇంటెలిజెన్స్ అధికారి హరిరాం శంకర్, సీఐడీ విభాగం అధికారి రాఘవేంద్ర కె. హెగ్డేను నియమిస్తూ సిట్ ఏర్పాటు చేసింది.

సీఎం, డీసీఎంకు వ్యతిరేకంగా జంతుబలి అవాస్తవం

- డీకే శివకుమార్ ఆరోపణలను ఖండించిన కేరళ మంత్రి

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు వ్యతిరేకంగా కేరళ రాష్ట్రంలో శత్రుభైరవీ యాగం పేరిట జంతుబలులు చేశారన్న ఆరోపణలను ఆ రాష్ట్ర మంత్రి ఖండించారు. గురువారం బెంగళూరులో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య, తనతోపాటు కర్ణాటక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర కేరళలోని రాజరాజేశ్వరిలో శత్రుభైరవీయాగం నిర్వహించారని ఆరోపించారు. 21 నల్ల గొర్రెలు, నల్లమేకలు, మూడు దున్నపోతులను బలి ఇచ్చారని పేర్కొన్నారు. యాగంలో పాల్గొన్న ఒకరు జాగ్రత్తగా ఉండాలని తనకు సూచించినట్లు తెలిపారు. డీకే శివకుమార్ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. ఈ మేరకు కేరళ ఉన్నత విద్య, సామాజిక న్యాయశాఖ మంత్రి ఆర్. బిందు శుక్రవారం స్పందించారు. కర్ణాటక డీసీఎం వ్యాఖ్యలను ఖండించారు. ఇటువంటి కృత్యాలు కేరళలో జరగవని స్పష్టం చేశారు. దేశంలోని పలు ప్రాంతాల్లో సమాజాన్ని ప్రాచీనయుగంవైపు తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.


సరిహద్దుల్లో కొనసాగుతున్న సర్వే

రాయదుర్గం, మే 31: ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఇనుప గనుల వద్ద శుక్రవారం రెండో రోజు సర్వే కొనసాగింది. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం సిద్దాపురం, మలపనగుడి గ్రామాల సమీపంలో ఉన్న కొండల్లో కేంద్ర బృందం సర్వే నిర్వహించింది. కర్ణాటకలోని ఏడు గనుల లీజు గడుపు పూర్తి కావడంతో రెన్యువల్ చేయడం కోసం ఈ సర్వే నిర్వహిస్తున్నారు. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం ఉండటంతో ఖచ్చితమైన సరిహద్దులను గుర్తించేందుకు అధికారులు రెండు రోజులుగా కసరత్తు చేస్తున్నారు. గనుల యజమానుల వద్ద ఉన్న లీజు రికార్డులు, ప్రభుత్వం వద్ద ఉన్న లీజు సరిహద్దు రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహిస్తున్నారు. రెండు రాష్ట్రాల మైనింగ్, అటవి, రెవెన్యూ శాఖల అధికారులు, భూరికార్డుల అధికారులు సర్వేలో పాల్గొంటున్నారు. విఠలాపురం, టుములి గ్రామాల చిత్రపటాలు, ఆ గ్రామాలకు ఆనుకుని ఉన్న సిద్దాపురం, మలపనగుడి గ్రామాల చిత్రపటాలను పరిశీలించి.. క్షేత్రస్థాయిలో కొలతలు తీస్తున్నారు. గనుల యజమానులకు లీజు సమయంలో కేటాయించిన సరిహద్దులను గుర్తించి, అనంతరం గ్రామాల సరిహద్దులను నిర్ధారిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రాథమికంగా గనులకు సంబంధించిన సరిహద్దులను గుర్తించినట్లు తెలిసింది. జూన్ ఆరో తేదీ వరకు పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. సర్వే ప్రక్రియలో ప్రొఫెసర్ సూరత్ హర్షవర్ధన్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ రూప్లా నాయక్, కర్ణాటక సీనియర్ జియాలజిస్టు చంద్రు, సర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొంటున్నారు.



గనుల ప్రాంతంలో సర్వే చేస్తున్న అధికారులు

పట్టుగూళ్ల మార్కెట్‌కు.. హైటెక్ సదుపాయాలు ఎన్నడో..?




- అమలుకు నోచుకోని నేతల హామీలు
- రైతులు, రీలర్ల అసంతృప్తి

శిడ్లఘట్ట, మే 31: ఆసియా ఖండంలో ప్రత్యేకమైన పట్టుగూళ్ల మార్కెట్‌గా పేరొందిన శిడ్లఘట్టలో ఇటీవల లావాదేవీలు తగ్గుముఖం పట్టాయి. మార్కెట్‌ను హైటెక్‌గా ఆధునికీకరించి మార్పు చేస్తామన్న నాయకులు హామీలు ఎప్పుడు అమలవుతాయోనని పట్టురైతులు ఎదురు చూస్తున్నారు. శిడ్లఘట్ట పట్టణం దిబ్బూరహళ్లి రోడ్డు సమీపంలోని అండర్‌పాస్ దగ్గర పట్టుగూళ్ల మార్కెట్ ఉంది. సుమారు 20కుపైగా ప్రభుత్వ కార్యాలయాలు మార్కెట్ పక్కనే ఉండడంతో ఈ ప్రాంతం సుందరంగా ఉంది. శిడ్లఘట్ట తాలూకాలో సుమారు 70శాతం పట్టురంగంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడి మార్కెట్‌లో వెయ్యి నుంచి కోట్లాది రూపాయల లావాదేవీలు సాగుతున్నాయి. శిడ్లఘట్ట తాలూకా నుంచే కాకుండా ఇతర తాలూకాలు, జిల్లాల నుంచి కూడా పట్టుగూళ్లు తెస్తుంటారు. మూడు నాలుగేళ్ల నుంచి రైతులు, రీలర్లకు ప్రయోజనకరంగా ఉండేది. ఇటీవల కొంత కాలంగా పట్టు రైతులు, రీలర్లలో అసంతృప్తి నెలకొంది. మార్కెట్‌లో హైటెక్ సదుపాయాలు కల్పిస్తే మాత్రమే ప్రయోజనకారి సాధ్యమని పలువురు రైతులు, రీలర్లు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్‌లో ఎక్కువగా ఫోర్త్ గ్రేడ్, ఇతర అధికారులు ఉన్నారు. స్థానిక పట్టుగూళ్ల మార్కెట్ ఆసియాలో నెంబరువన్ అన్న పేరు పూర్తిస్థాయిలో సాకారం కావాలంటే ఆ మేరకు సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మార్కెట్‌లో పట్టుగూళ్ల లాట్‌లు..



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.36	1,580.50
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	00	1580
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	27	239
సామర్థ్యం (టీఎంసీలు)	3.32	4.72



పాల వెల్లువ

నేడు పాల దినోత్సవం

- కరువులోనూ పెరిగిన పాల ఉత్పత్తి
- కేఎంఎఫ్ డెయిరీకి ఆదరణ
- పాడి పశువుల సంరక్షణలో కన్నడ రైతుల విజయం

బళ్లారి సిటీ,మే31: కరువు రైతును పాడిపశువులు ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. జిల్లాలో గతంతో పోలిస్తే ప్రస్తుతం పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రధానంగా ఈప్రాంతంలో పాడి పశువులకు పుష్కలంగా మేత నీరు లభించడంతో పాటు రైతులు పాడి పశువులను సంరక్షించుకోవడంలో సఫలం అవుతున్నారు. బళ్లారి కేఎంఎఫ్ పరిధిలో బళ్లారి, కొప్పళ, రాయచూరు మూడు జిల్లాలు వస్తాయి. బళ్లారి, కొప్పళ సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా పాల ఉత్పత్తి భారీగా పెరిగింది. గతేడాది పోలిస్తే ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు రాబోకో డేటా ద్వారా రోజూ 1.5 నుంచి 20వేల కిలోల అదనపు పాలు ఉత్పత్తి అవుతున్నాయి.

జనవరి 2023లో పాల ఉత్పత్తి సగటు రోజుకు 1.58,089 కిలోలు, కాగా ఈ ఏడాది అది 1,72,855కిలోలకు చేరింది. గత ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ సగటు ఉత్పత్తి 1,55,039 కిలోలు కాగా ఈఏడాది అది 1,72,855కిలోలకు పెరిగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో సగటు ఉత్పత్తి 1.78,002 కిలోలు రావడం రాబోకో అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా వేసవిలో పాల ఉత్పత్తి తగ్గుతుంది. గతేడాది కూడా పాల ఉత్పత్తి తక్కువగా ఉంది. అయితే ఈసారి వేసవిలోనే పాల ఉత్పత్తి పెరిగడం విశేషం. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందని రాబాకో మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతప్ప అన్నారు. వర్షాకాలంలో పచ్చిమేత అందుబాటులోకి వచ్చిన వెంటనే పాల ఉత్పత్తి మరింత పెరుగుతుందని, నెయ్యిప్లెక్స్ ప్యాక్‌లు సిద్ధం చేస్తామని తెలిపారు. మిగిలిన పాలతో మరిన్ని ఉప ఉత్పత్తులను తయారు చేస్తామన్నారు.





నందిని మిల్క్ డెయిరీ

గంజాయితో వ్యాధులపాలు



ర్యాలీకి జెండా ఊపుతున్న న్యాయాధికారి హుస్సేన్‌సాబ్

సిరుగుప్ప, మే 30 : గంజాయి సేవించడం మనిషికి ఎన్నో వ్యాధులు తెచ్చిపెడుతుందని సివిల్ న్యాయాధికారి హుస్సేన్‌సాబ్ తెలిపారు. సిరుగుప్ప పట్టణ ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం గంజాయి వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి వద్ద చేపట్టిన జన జాగృతి ర్యాలీని జడ్జి పచ్చజెండా ఊపడం ద్వారా ప్రారంభించారు. అనంతరం వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో చెట్లను పెంచాలని ఆయన తెలిపారు. మనిషి మందు, పొగాకు, గంజాయి వంటి అలవాట్లకు పాల్పడరాదని సూచించారు. ఈ సందర్భంగా తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ, న్యాయవాదులు అబ్దుల్ సాబ్, వెంకటేష్, మంజునాథ, సమాజ సేవకుడు అబ్దుల్ నబీ, ప్రభుత్వాస్పత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఇందిర సర్కిల్ నుంచి రోడ్డు విస్తరణ



విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

బళ్లారి సిటీ, మే 31: ఇందిరా సర్కిల్ (సంగం సర్కిల్) నుంచి హజరత్ జానీ మగ్దూమ్ జానీ దర్గా మీదుగా సిందగి కాంపౌండ్ వరకు రోడ్డు విస్తరణ పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలని నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి కార్పోరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన గురువారం మధ్యాహ్నం గడిగిచెన్నప్ప సర్కిల్, నగరూరు నారాయణరావు పార్కు, కాటేగుడ్డ, ఇందిరా సర్కిల్ రోడ్లను పరిశీలించారు. రోడ్డు విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కమిషనర్ ఖలీల్ సాబ్‌కు సూచించారు. గడిగి చెన్నప్ప సర్కిల్లో చేపట్టిన సర్కిల్ పనులు, ఆక్రమణలు తొలగించిన రోడ్డు అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సమయంలో ఆయనవెంట కార్పోరేషన్ సభ్యులు ప్రభంజన్‌కుమార్, రామాంజనేయులు, శ్రీనివాసులు తదితరులున్నారు.

బావిలో పడి ఇద్దరు చిన్నారుల మృతి




చిన్నారులు సౌందర్య, లక్ష్మి (ఫైల్)

బళ్లారి గాంధీనగర్, మే 31: తాలూకా పరిధిలోని చిన్నాపుర తాండా శివారులో ఆటలాడేందుకు వెళ్ళిన ఇద్దరు బాలికలు ప్రమాద వశాత్తు సమీపంలోని బావిలో పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 3.30గంటలకు జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. వీరిని తాండా ప్రాంతంలో నివాసం ఉంటున్న సౌందర్య రత్నప్ప జూజార (11), లక్ష్మి శకరణప్ప పూజార(10)లుగా గుర్తించారు. ఈత రాని కారణంగా బావిలో పడిన కొన్ని గంటల్లోనే ఇద్దరు బాలికలు మృతి చెందారు. ఘటనా స్థలానికి అగ్నిమాపక శాఖ సిబ్బంది, కొప్పళ గ్రామీణ పోలీసులు చేరుకుని నీటిలో మునిగిన ఇద్దరి బాలికల శవాలను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కొప్పళ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువరానివి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యాశాఖాధికారి గురప్ప

సిరుగుప్ప, మే 31 : ఉపాధ్యాయుల సేవలు మరువరానివని విద్యాశాఖాధికారి గురప్ప అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరుగుప్ప తాలుకాలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ముఖ్య ఉపాధ్యాయలు బసవరాజయ్య, ఉపాధ్యాయులు శరణప్ప శుక్రవారం రిటైర్‌మెంట్ పొందారు. రిటైర్‌మెంట్ పొందిన ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు, సాటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ సేవలు ఎన్నటికీ మరువరానివని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ముందు రోజుల్లో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతో కష్ట పడి చదివించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ సంయోజకులు తమ్మన్నగౌడ పాటిల్, మేనేజర్ ప్రహల్లాద, ఉపాధ్యాయులు, ప్రజలు, పాల్గొన్నారు.

తుంగభద్ర నదికి మొదలైన ఇన్‌ఫ్లో

- సింగటలూరు బ్యారేజీ నుంచి 1100 క్యూసెక్కుల నీటి విడుదల

బళ్లారి సిటీ,మే 31: విజయనగర జిల్లాలోని హూవినహడగలి తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర నదిలో లోతట్టు ప్రవాహం మొదలైంది. ఇక్కడి సింగటలూరు బ్యారేజిలో నీటి నిల్వ పెరుగుతుండడంతో గురువారం 1100 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు.



సింగటలూరు బ్యారేజీ నుంచి నీటిని నదికి వదులుతున్న దృశ్యం

గతేడాది రుతుపవనాలు, వర్షాభావ పరిస్థితులతో తుంగభద్ర నది ఎండిపోయింది. పట్టణంతో పాటు తాలూకాలోని పలు గ్రామాలకు నీరు అందక. సింగటలూరు బ్యారేజీ డెడ్ స్టోరేజీకి చేరుకుంది. నీటి సమస్య తీరకముందే వర్షం రావడం ప్రజలకు కొంత ఊరటనిచ్చింది. కొద్దిరోజులుగా నదికి ఇన్‌ఫ్లో పెరగడంతో సింగటలూరు బ్యారేజీలో 3.38 టీఎంసీల నీరుచేరింది. బ్యారేజీ రెండు గేట్లను తెరిచి నీటిని నదిలోకి వదులుతున్నారు. కొన్ని రోజులుగా నిలిచి పోయిన నదిలో నీటి ప్రవాహం నేటి నుంచి ప్రారంభమైంది. పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్యారేజీ బ్యాలెన్స్‌ను కాపాడుతూ నదికి 1100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని సింగటలూరు సాగునీటి పథకం సబ్ డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాఘవేంద్ర తెలిపారు. హూస్పేట సమీపంలోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో ఇంకా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 3.38 టీఎంసీల నీరు ఉంది. సింగటలూరు బ్యారేజీ నుంచి నీటి ప్రవాహం ప్రారంభమైనందున్న, తుంగభద్రజలాశయానికి కూడా ఒకట్రెండు రోజుల్లో ఇన్‌ఫ్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 1633 అడుగుల ఎత్తైన తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం 1.577.40 అడుగుల వరకు మాత్రమే నీటి నిల్వ మాత్రమే ఉంది.

లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి: డీసీ

బళ్లారి సిటీ, మే 31: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్దం చేసినట్లు బళ్లారి జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా చెప్పారు. శుక్రవారం డీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బళ్లారి లోక్‌సభ స్థానాల పరిధిలోకి వచ్చే 8శాసనసభ నియోజకవర్గాల్లో జరిగిన ఓట్లను ఈనెల 4న లెక్కించనున్నట్లు చెప్పారు. జూన్ 04వ తేది ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, ఓట్ల లెక్కింపు కేంద్రంలో 20 ఈవీఎం స్ట్రాంగ్ రూంలు, 02పోస్టల్ ఓట్ స్ట్రాంగ్ రూంలు ఉన్నాయని 08 హాళ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14టేబుళ్లను సిద్దం చేశారు. ఒక్కో టేబుల్‌కు ఒక కౌంట్ సూపర్‌వైజర్, ఒక కౌంట్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్‌లను కేటాయించారు. బళ్లారి జిల్లాకు మొత్తం 112 టేబుళ్లు, 150మంది ఎన్యూమరేషన్ సూపర్‌వైజర్లు, 159మంది ఎన్యూమరేషన్ అసిస్టెంట్లు, 146మంది ఎన్యూమరేషన్ మైకోఅబ్జర్వర్‌లను నియమించామన్నారు. కౌంటింగ్ అధికారులు, సహాయకులకు ఇప్పటికే ఒక స్థాయి శిక్షణ ఇవ్వగా రెండో స్థాయి శిక్షణ కూడా ఇస్తామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లుగా ఇప్పటికే 121మందికి అబ్జర్వేషన్ పాస్‌లు అందజేశామన్నారు. నగరంలోని రావుబహద్దూర్ వై మహాబలేశ్వరప్ప సాంకేతిక కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఓట్ల లెక్కింపు ప్రతి దశకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలిపేందుకు కౌంటింగ్ కేంద్రంలో మీడియా సెంటర్‌ను ప్రారంభించినున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం చుట్టు ప్రక్కల 100మీటర్ల ప్రాంతంలో వాహనాలను అనుమతించేదిలేదని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో మద్యం విక్రయాలను నిషేధించినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

పోలీసు అధికారుల నియామకం

జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రమైన రావుబద్దూర్ వై మహాబలేశ్వర్ సాంకేతిక కళాశాల చుట్టూ పోలీసు అధికారులు, సిబ్బందిని మోహరించారు. ఒక ఎస్పీని, ఇద్దరు ఏఎస్పీలను ఐదుగురు డీవైఎస్పీలను నియమించినట్లు అదనపు పోలీసు సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలను సద్వినియోగం చేసుకోవాలి



శివశంకర్ పొలంలో నీటికుంటలను పరిశీలిస్తున్న ఏవో దేవరాజ్

కంప్లి, మే 31 : మెట్ట భూముల్లో వర్షాధారంపై పంటలు పండించే రైతన్నలు ప్రభుత్వం ఇచ్చిన కృషి హోండా (నీటికుంట) సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కురుగోడు వ్యవసాయ శాఖాధికారి దేవరాజు తెలిపారు. కురుగోడు తాలుకా పరిధిలోని బాదనట్టి గ్రామంలో శివశంకర్ పొలంలో నీటికుంట ఏర్పాటు చేశారు. దానిని పరిశీలించడానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ ఈ కృషి హోండా సదుపాయాలు హెచ్చెల్సీ, ఎల్ఎల్సీ కాలువల కింద వున్న రైతన్నలకు వర్తించవన్నారు. కేవలం మెట్ట భూముల రైతన్నలకు మాత్రమే వర్తిస్తాయన్నారు. ఈ పథకం కింద నీటి కుంటలు ఏర్పాటు చేసుకుని మోటార్ల ద్వారా పొలానికి నీటిని అందించవచ్చునని తెలిపారు. ఇప్పటికే నాలుగు నీటి కుంటలు మంజూరయ్యాయన్నారు. అలాగే విత్తనాలు, రసానియక ఎరువులను తమ కేంద్రం ద్వారా రైతన్నలు కొనుగోలు చేస్తున్నారన్నారు. తాము కూడా రైతన్నలు డిమాండ్ మేరకు వాటిని సిద్దంగా వుంచామని తెలిపారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



వృద్ధాశ్రమంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కృష్ణ అభిమానులు

బళ్లారిరూరల్, మే 31 : తెలుగు నటుడు సూపర్‌స్టార్ కృష్ణ 82వ జయంతి సందర్భంగా బళ్లారి నగరంలో శ్రీ శివశక్తి సేవాట్రస్టు ఆధ్వర్యంలో కృష్ణ అభిమానులు వృద్దాశ్రమంలో వృద్దులకు దుస్తులను పంపిణీ చేశారు. వృద్దాశ్రమంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అభిమాన సంఘం అధ్యక్షులు రాఘవరమేష్ మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ చేసిన సేవలు ఎనలేనివని, అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో క్యాటరింగ్ సాయి, సుబ్బరాయుడు, దేవకుమార్, రవిశంకర్, మల్లి, రాము, శీనా, బాబు, అజయ్, సూరి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం మానేయాలి

బళ్లారి సిటీ, మే 31: ధూమపానం జీవితానికి హానికరమని ధూమపానం మానేసి ధృడమైన ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవంలో బాగంగా జిల్లా పొగాకు నియంత్రణ సెల్, జిల్లా ఆసుపత్రి సహకారంతో శుక్రవారం జిల్లా కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయ ఆవరణనుంచి ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయాధికారి

పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

బళ్లారిరూరల్, మే 31: బళ్లారి నగరంలో విమ్స్ ఆస్పత్రి క్యాంపస్ వైద్యులు, డెంటల్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం పొగాకు దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి ఆవరణంతో పాటు పరిసర ప్రాంతాలైన సుధా సర్కిల్, మేరీమాత చర్చి, వాసవీ స్కూలు, పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈడీ కృష్ణ, వైద్యులు వీరారెడ్డి, మంజునాథ్, డాక్టర్ భారతి, తదితరులు పాల్గొన్నారు.

నారా ప్రతాప్ కోసం దొడ్డ కేశవరెడ్డి ప్రచారం

బళ్లారిరూరల్, మే 31 : బళ్లారి నగరంలో ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నారా ప్రతాప్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షులు దొడ్డ కేశవరెడ్డి ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి లాంటి వారికి ఓటువేసి గెలిపిస్తే విద్యార్థినీ విద్యార్థులకు ఎన్నో సౌలభ్యాలు అందుతా యన్నారు. ఈ కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షులు మంజునాథ్, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులు రుద్రప్ప, లక్ష్మణ్ ఎస్ భండారి, నాగరాజు గౌడ పాల్గొన్నారు.

చిదానంద సేవలు మరువలేనివి



చిదానందప్పను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి, మే 31 : కంప్లి పురసభ నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్నచిదానందప్ప సేవలు మరువలేనివని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మాంతేష్ తెలిపారు. ఆయన శుక్రవారం పదవీ విరమణ చేయడంతో పురసభ ప్రాంగణంలో ఆ దంపతులను అధికారులు, సిబ్బంది, మున్సిపల్ కౌన్సిలర్లు సన్మానించారు. వారితో పాటు ఆర్వో నాగభూషణ, ప్రకాష్ బాబు, గౌస్, మేఘన, మంజునాథ్, జ్యోతి, సబీనా, విజయలక్ష్మి, తులసి, వసంతమ్మ, ఆంజనేయులు, రమేష్, మధు, పురసభ మాజీ అధ్యక్షురాలు శాంతలా విద్యాధర్, కౌన్సిలర్లు, సంఘ సంస్థనేతలు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కౌంటింగ్ నిర్వహణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సరయు

హోసూరు, మే 31: కౌంటింగ్ నిర్వహణలో చేపట్టాల్సిన భద్రత, పాటించాల్సిన మార్గదర్శకాలపై కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కేఎం సరయు నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం జరిగింది. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పి.తంగదురైతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, జిల్లా కలెక్టర్ ఇంటర్యూ అసిస్టెంట్ పి.పుష్ప, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, జిల్లా కలెక్టర్లు, పబ్లిక్ వర్క్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన డాక్టర్లు, ఇంజనీర్లు

హోసూరు, మే 31: హోసూరు రాయకోట రోడ్డులో రూ.100 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ సర్వజన వైద్యశాల పనులను జిల్లా సంక్షేమశాఖ సంయుక్త సంచాలకులు పరిశీలించారు. కృష్ణగిరిలో వైద్య కళాశాల ఆసుపత్రి ఏర్పాటు తర్వాత కృష్ణగిరి ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని హోసూరు పట్టణానికి తరలించారు. ప్రస్తుతం హోసూరు-రాయకోట రోడ్డులో రూ.100 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సంక్షేమ పనులను దర్మర్, హోసూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రిన్సిపల్ డాక్టర్ జ్ఞానమీనాక్షితో పాటు అధికారులు, ఇంజనీర్లు సందర్శించారు.



ముత్తుమారియమ్మ ఆలయంలో పూజలు

హోసూరు(సిఫ్‌కాట్), మే 31: హోసూరు - బెంగళూరు రహదారిపై వెలసిన ముత్తుమారియమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మారుతీ నగర్ ముత్తుమారియమ్మ సర్కిల్‌లోని ఖాళీ స్థలంలో ఓ ప్రైవేట్ సంస్థ, ముత్తుమారియమ్మ టెంపుల్ ట్రస్ట్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయకమిటీ అధ్యక్షుడు బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజీ, కోశాధికారి రామనాథన్, ఉపాధ్యక్షుడు సెల్వం, ఉప కార్యదర్శి వేలు, కమిటీ సభ్యులు మణిరామమూర్తి, సామాజిక కార్యకర్తలు మురుగన్, కుమార్, కార్తీక్ ఆలయ పూజారీ శ్రీనివాసన్ అన్నామలై పాల్గొన్నారు.



దేవాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

అన్నాడీఎంకే కౌంటింగ్ ఏజెంట్ల సమావేశం

హోసూరు, మే 31: పశ్చిమజిల్లా అన్నాడీఎంకే కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్ల సమావేశం శుక్రవారం జరిగింది. అన్నాడీఎంకే ఉప కార్యదర్శి కేపీ మునిస్వామి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్న తరుణంలో కృష్ణగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని హోసూరు, తళి నిర్వాహకులకు నియోజకవర్గాలవారీగా సలహాలు అందజేశారు. కృష్ణగిరి జనరల్ కమిటీ సభ్యుడు సతీశ్‌కుమార్, హోసూరు ఏరియా కార్యదర్శులు రాజు, వాసుదేవన్, మంజు, హోసూరు యూనియన్ కమిటీ అధ్యక్షుడు శశివెంకట్ స్వామి, డెంకణీకోట కౌన్సిలర్ పళని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మునిస్వామి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

రాయచూరు, మే 31 : పాఠశాలలు పున: ప్రారంభమవుతున్న వేళ ప్రైవేటు విద్యసంస్థలు ఫీజుల దోపిడి చేయకుండా నియంత్రించాలని సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ కోరారు. జిల్లాధికారి కార్యాలయంలో శుక్రవారం నాయకులు ఈ మేరకువినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు జి.అమరేశ్, నగరంలోని పలు పాఠశాలలు డొనేషన్ పేరుతో కాకుండా ట్యూషన్ ఫీజు పేరుతో పెద్ద ఎత్తున తల్లిదండ్రుల నుంచి ఫీజుల దోపిడికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ప్రైవేటు విద్యసంస్థలు తమ ఫీజుల వివరాలను ప్రకటించాలని ప్రభుత్వం నిబంధన విధించిన నేపథ్యంలో నామినల్‌గా ఫీజులు నమోదు చేస్తూ ట్యూషన్ ఫీజు రూపంలో భారీగా దండుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రైవేటు విద్యసంస్థలకు అధికారులతో పాటు రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో దోపిడీ యధేచ్ఛగా కొనసాగుతున్నట్లు వివరించారు. జిల్లా అధికారి జోక్యం చేసుకుని ప్రైవేటు విద్యసంస్థల ఫీజుల పై నియంత్రణ విధించాలని కోరారు.



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న అమరేశ్

పొగాకు నిషేధానికి కృషి చేయాలి

రాయచూరు, మే 31: ప్రాణాంతక వ్యాధులకు కారకంగా మారుతున్న పొగాకు వాడకంపై నిషేధం కోసం సమిష్టిగా కృషి చేద్దామని న్యాయాధికారి సిద్దరామప్ప కల్యాణరావ్ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని డీహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసి న కార్యక్రమాన్ని పచ్చజెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సిద్దరామప్ప కల్యాణరావ్ మాట్లాడుతూ క్యాన్సర్ కారకంగా భావించే పొగాకు సేవనం వల్ల జరిగే అనార్థం పై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు వైద్య ఆరోగ్య సేవల్లో భాగస్వాములుగా ఉంటున్న ఆశా,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం నర్సులు పొగాకు సేవనంతో వచ్చే ప్రమాదకరమైన రోగాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. గుట్కాలు, పాన్‌పరాగ్‌లు, ధూమపానం వల్ల ఆరోగ్యానికి జరిగే హాని గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా పొగాకు వ్యతిరేక ఉద్యమానికి సంబంధించిన ఫ్లకార్డులతో ఆశా కార్యకర్తలు, నవోదయ వైద్య కళాశాల విద్యార్థులు స్థానిక డీహెచ్‌ఓ కార్యాలయం వద్ద నుంచి నగరంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయాధికారి సిద్దరామప్ప

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

నీలం సంజీవరెడ్డి (వర్ధంతి)




భారత ఆరో రాష్ట్రపతిగా వ్యవహరించిన నీలం సంజీవరెడ్డి 1913 మే 19న అనంతపురం జిల్లా ఇల్లూరు గ్రామంలో జన్మించారు. రాష్ట్రపతిగా 1977-82 మధ్య వ్యవహరించారు. మొరార్జీ దేశాయ్, చరణ్‌సింగ్, ఇందిరా గాంధీ వంటి ప్రధానులతో కలసి పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, లోక్‌సభ సభాపతిగా, ఆంధ్ర రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి ప్రజల మన్ననలు పొందిన రాజకీయవేత్త. లోక్‌సభ సభాపతిగా ఎన్నిక కాగానే తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి మంచి వాతావరణం నెలకొల్పి స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన రాయలసీమ రాజకీయ ఆణిముత్యం. 1996 జూన్ 1న బెంగళూరులో కన్నుమూశారు.

నర్గీస్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత నర్గీస్ దత్ 1929 జూన్ 1న జన్మించారు. అసలు పేరు ఫాతిమా రషీద్. హిందీ సినీరంగంలో పేరొందిన నటుడు సునీల్‌దత్ భార్య. వీరి కుమారుడు సంజయ్‌దత్ కూడా నటుడిగా పేరొందారు. మూడు దశాబ్దాలపాటు తిరుగులేని నటిగా రాణించారు. రాజ్‌కపూర్‌తో కలసి పలు హిట్ సినిమాలలో నటించారు. 1957లోని 'మదర్ ఇండియా' సినిమాలో ఆమె నటనకు ఉత్తమ నటి, ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. రాజ్యసభ సభ్యురాలిగానే కాకుండా సమాజసేవలో రాణించారు. 1981 మే 3న కన్నుమూశారు.

మోర్గాన్ ఫ్రీమాన్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన ప్రముఖ నటుడు మోర్గాన్ ఫ్రీమాన్ 1937 జూన్ 1న జన్మించారు. నటుడిగానే కాక దర్శకుడు, నరేటర్, తనదైన గొంతుతో అభిమానులను ఆకట్టుకున్నారు. వివిధ పాత్రలతో అన్ని తరాల వారిని అలరించారు. అకాడమీ అవార్డు, గోల్డెన్ గ్లోబ్ అవార్డు, స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ సపోర్టింగ్ నటుడిగా పలు అవార్డులు పొందారు.

కరణం మల్లీశ్వరి (పుట్టినరోజు)



ఒలింపిక్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో 2000లో 69 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించిన దేశ తొలి మహిళా వెయిట్‌లిఫ్టర్, 'పద్మశ్రీ' గ్రహీత కరణం మల్లీశ్వరి 1975 జూన్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా ఊసవానిపేటలో జన్మించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. ఇస్తాంబుల్‌లో 1995లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో 113 కిలోల విభాగంలో రజతపతకం సాధించారు. 29 ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించగా వీటిలో 11 బంగారు పతకాలు ఉండడం విశేషం. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ఢిల్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ యూనివర్సిటీకి 2021 జూన్‌లో వైస్ చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు.

దినేశ్ కార్తీక్ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ దినేశ్ కార్తీక్ 1985 జూన్ 1న తమిళనాడు రాష్ట్రం మద్రాస్‌లో జన్మించారు. ఇండియన్ క్రికెట్ టీమ్, ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడారు. ప్రస్తుతం తమిళనాడు క్రికెట్ టీమ్‌కు కెప్టెన్‌గా ఉన్నారు. టి-20 మ్యాచ్‌లు 300 ఆడిన నాల్గవ ఇండియన్ బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందారు. 2019 క్రికెట్ వరల్డ్‌కప్‌లో 'ఇండియాస్ స్క్వాడ్' పేరు పొందారు. అంతేకాక 2021-21ల మధ్య బ్రిటీష్ చానెల్ స్కై స్పోర్ట్స్‌కు కామెంటేటర్‌గా కూడా వ్యవహరించారు. కాగా స్క్వాష్ క్రీడాకారిణి దీపికా పల్లికల్‌ను వివాహం చేసుకున్నారు.

కాంగ్రెస్ తరఫున ఒక అభ్యర్థి నామినేషన్



నామినేషన్ వేస్తున్న అసీఫ్ పాషా

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): 11 ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నుంచి అసీఫ్ పాషా నామినేషన్ దాఖలుచేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన ఐదో రోజున తొలి నామినేషన్ దాఖలైనట్టు ఎన్నికల అధికారి, శాసనసభ వ్యవహారాల కార్యదర్శి ఎంకే విశాలాక్షి ప్రకటించారు.

స్వచ్ఛతపై వీధి నాటకం

శిడ్లఘట్ట, మే 31: ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో తాలూకాలోని మళ్ళూరు, చీమంగల గ్రామాల్లో నీటి పొదుపు, స్వచ్ఛత పాటించడంపై మహిళా జ్ఞానవికాస కార్యక్రమంలో భాగంగా వీధినాటకాన్ని ఏర్పాటు చేశారు. మండ్యకు చెందిన సౌహార్ద్ర సంస్కృతి కళాబృందం నాటకాన్ని ప్రదర్శించింది. తాలూకా యోజనాధికారి సురేశ్‌గౌడ కార్యక్రమాన్ని ప్రారంభించి మాటాడుతూ ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే చొరవతో సామాజిక చైతన్యం సహా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. అఖిల కర్ణాటక జనజాగృతి వేదిక జిల్లా సభ్యుడు త్యాగరాజ్ మాట్లాడుతూ ఏటా స్వాస్థ సంకల్ప కార్యక్రమం, పొగాకు వ్యతిరేక దినం, మద్యపాన నియంత్రణ శిబిరం వంటివి కొనసాగుతున్నాయన్నారు. యువత దుర్వ్యసనాలకు లోను కారాదన్నారు. గ్రామపంచాయతీ అధ్యక్షురాలు చంద్రకళ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నాటకాలతో మరింత చైతన్యం



నాటక శిబిరం ముగింపు కార్యక్రమంలో ప్రముఖులు

బంగారపేట, మే 31: మొబైల్ వ్యసనం నుంచి బయట పడేయడానికి నాటకాలు చక్కటి మార్గమని కోలారు జిల్లా కన్నడసాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్‌బీ గోపాలగౌడ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని సంతోష్ విద్యాసంస్థ ఆవరణలో సముదాయ బెమెల్‌నగర్, కేజీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బంగారపేటలో నిర్వహిస్తున్న నాటకరంగ శిబిరం 2024 ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇటీవలి కాలంలో పిల్లలు మొబైళ్లకు గంటల తరబడి అతుక్కుని పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. మొబైల్ సాంకేతిక ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 8, 9 తరగతి పిల్లలు సైతం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వాడుతున్నారని వీటిపట్ల తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పిల్లలకు పుస్తక పఠనంపై అభిరుచి పెంచేలా ప్రోత్సహించాలన్నారు. మన జీవితం ఎలా ఉండాలి, జీవితం కోసం ఎలా పాటుపడాలి అనే అంశాలను ఒక నాటకం ద్వారా నేర్పించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. నాటకాన్ని చాన్‌పాషా రాయగా, జగదీశ్ నాయక్ దర్శకత్వం వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంతోష్ విద్యా సంస్థల కార్యదర్శి ఆదిల్‌పాషా ప్రసంగిస్తూ వేసవి సెలవులను అర్థవంతంగా నాటకాలు నేర్చుకునేలా శిబిరం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కళాజాథా శిబిరాలు, రంగవల్లుల పోటీలు, చిత్రకళా పోటీలు ఇలా ఎన్నింటినో సముదాయ సంఘం నాలుగు దశాబ్దాలుగా నిర్వహిస్తుండడం అభినందనీయమని సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనార్ధన పేర్కొన్నారు. అనికేతన బళగ అధ్యక్షుడు ఎంఎస్ రామప్రసాద్, పురసభ సభ్యుడు రాకేశ్‌గౌడ తదితరులు ప్రసంగించారు. ముగింపువేళ నాగశిరోమణి నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో రామమూర్తి, అలిక్, సుమ, రవీంద్ర, ధరణీకాంత్, మారుతిప్రసాద్, వెంకోబరావ్ తదితరులు పాల్గొన్నారు.



నాగశిరోమణి నాటకంలోని ఓ సన్నివేశం

ధూమపాన వ్యసనం వీడండి



పొగాకు వ్యతిరేక దినం కార్యక్రమంలో న్యాయాధికారి రంగస్వామి తదితరులు

బాగేపల్లి, మే 31: పొగాకు వాడకం వల్ల అనేక ప్రాణాంతక రోగాలు ప్రబలుతున్నాయని, ఇటువంటి ధూమపాన వ్యసనం వీడాలని ఆరోగ్యకరజీవనం కోసం పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని బాగేపల్లి పట్టణ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయాధికారి రంగస్వామి హితవు పలికారు. పట్టణంలోని పాత ఎస్‌బీఐ రోడ్డులోని ఎక్స్‌పెర్ట్ పీయూ కళాశాలలో తాలూకా న్యాయసేవల సమితి, న్యాయవాదుల సంఘం, కార్మికశాఖ, ఆరోగ్యశాఖ, పాత్రికేయుల సంఘం సంయుక్తంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. నేటి యువతీయువకులు ఫ్యాషన్ కోసం పొగాకు, మద్యపానం వంటివాటికి బానిసలు అవుతున్నారన్నారు. బీడీ, సిగరెట్‌సహా మాదకపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ధూమపానం, మద్యపానం వంటివి ఆరోగ్యానికి ప్రమాదకరం అని తెలిసి కూడా వాటికి ఆకర్షితులు కావడం విచారకరమన్నారు. తమ జీవితాన్ని తామే చేతులారా పాడు చేసుకుంటున్నారన్నారు. వీటికి సంబంధించి ఎన్నో ప్రకటనలు వస్తున్నప్పటికీ ఆచరణలో విఫలం అవుతున్నారన్నారు. తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వరల్డ్ నో టొబాకో డేను పురస్కరించుకుని జాగృతి కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఈసారి 'పొగాకు నుంచి పిల్లలను కాపాడాలన్నది' నినాదంగా ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రామాంజి, కార్యదర్శి ప్రసన్నకుమార్, కోశాధికారి మంజునాథ్, న్యాయవాదులు ఫయాజ్‌బాషా, వెంకటేశ్, వెంకట నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ శివప్ప తదితరులు పాల్గొన్నారు.

మలె మహదేశ్వర హుండీ ఆదాయం రూ. 2.58 కోట్లు

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా హనూరు తాలూకాలో మలె మహదేశ్వరస్వామి కొండపై వెలసిన ఆలయంలో కానుకలు నెలవారీ పెరుగుతూ వస్తున్నాయి. మే నెలకు సంబంధించి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం నుంచి గురువారం దాకా లెక్కింపులు జరిపారు. మూడు రోజులపాటు హుండీ ఆదాయాన్ని లెక్కించగా ఏకంగా 2.58 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. కొండపై ఉండే షాపింగ్ కాంప్లెక్స్‌లోని సాలూరు బ్రహ్మన్మఠం అధ్యక్షులు శాంతమల్లికార్జునస్వామిజీ సమక్షంలో హుండీ లెక్కింపు ప్రక్రియ ఆరంభమైంది. మే నెలలో విద్యాసంస్థలకు సెలవులు, మరోవైపు ఎన్నికలు ముగియడంతో ప్రతిరోజూ భక్తులు పోటెత్తారు. అందుకు అనుగుణంగానే హుండీ ద్వారా ఆదాయం కూడా కోట్లకు పెరిగింది. 2,58,44,097 రూపాయలు నగదుతోపాటు 93 గ్రాముల బంగారం, 3350 గ్రాముల వెండి ఆభరణాలు కానుకగా వచ్చాయి. సౌదీ అరేబియా, జపాన్, నేపాల్, ఖత్తార్ దేశానికి సంబంధించి నాలుగు విదేశీ కరెన్సీ కూడా హుండీలో లభించాయి. 2వేల రూపాయల విలువైన చెల్లని 25 నోట్లు ఉన్నట్టు ఆలయ కార్యదర్శి రఘు తెలిపారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పండ్ల ధరలకు రెక్కలు



పట్టణంలో పండ్ల విక్రయాలు

శిడ్లఘట్ట, మే 31: పండ్ల రారాజు మామిడి సహా అన్ని పండ్ల ధరలు రెక్కలొచ్చినట్టుగా పెరిగాయి. వేసవి ఆరంభం మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు తీవ్రంగా ఉండడం, వర్షాలు లేకపోవడంతో పంటల దిగుబడి బాగా తగ్గింది. సాధారణంకంటే ఎక్కువగా అంటే 40, 40 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. పదిరోజులక్రితం తొలకరి చినుకులు కురిశాయి. పూర్తిస్థాయిలో వర్షాలు కురవలేదు. నాలుగైదురోజులుగా ఎండలధాటి కొనసాగుతోంది. మార్కెట్‌లో హోల్‌సేల్ ధరలు కూడా పెరగడంతో పండ్ల ధరలు రిటైల్‌గా కూడా అధికంగా ఉన్నాయి. శిడ్లఘట్ట పట్టణంలో సుమారు 20కుపైగా ఫ్రూట్‌స్టాల్స్ ఉన్నాయి. అయితే తోపుడుబండ్లపై మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదు. మామిడి కిలో రూ.80 నుంచి 200దాక పలుకుతోంది. కిలో యాపిల్ రూ.200 నుంచి 250, దానిమ్మ సైతం కిలో రూ.200-250వరకు ఉంది. ఇక మూసంబి రూ.100 నుంచి 150, పైనాపిల్ ఒక కాయ రూ.50-80వరకు, బొప్పాయి కిలో రూ.40-60, పుచ్చకాయ రూ.40-60, దోసకాయ రూ.40-60 మధ్య ధరలు ఉన్నాయి. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు పండ్ల జ్యూస్‌లు తాగాలాన్నా ధరలు మండిపోతున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి ధరలు ఎక్కువగా ఉన్నాయని పలువురు వినియోగదారులు వాపోతున్నారు.

ఘనంగా ఆలయ రజతోత్సవం

బాగేపల్లి, మే 31: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ 25వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పట్టణంలోని ఆర్యవైశ్య మండలి ట్రస్టు ఆధ్వర్యంలో పలు విశేషపూజలు, కైంకర్యాలు ఘనంగా జరిగాయి. బస్టాండ్ నుంచి డాక్టర్ హెచ్ఎన్ సర్కిల్, డీవీజీ మెయిన్ రోడ్డు వరకు ఇరువైపులా విద్యుద్దీపాలతో అలంకరించారు. వాసవిమాతకు విశేష పూజలు, అలంకరణలు నిర్వహించారు. గంగపూజ, మాతృకాపూజ, రక్షాబంధన, యాగశాల ప్రవేశం, యాగమండప ప్రవేశం, కళశస్థాపన, మహామంగళారతి, అంకురార్పణ, మూల మంత్ర అగ్నిప్రతిష్ఠ, వాసు హోమం, దీక్షా హోమం, గణపతి హోమాలు, బలిహరణ సహా పలు పూజాకైంకర్యాలు నిర్వహించారు. పట్టణంలోని రాఘవేంద్రస్వామి ఆలయం ముందు భాగం నుంచి వాసవిమాత విగ్రహాన్ని ఆర్యవైశ్య మహిళలు, పురుషులు ఊరేగింపుగా సాగా రు. నాదస్వర, డోలు కళాబృందాల నడుమ కళశాలతో ఊరేగారు. గ్రామదేవత గంగమ్మ ఆలయంలోనూ పూజలు చేశారు. వాసవిమాత విగ్రహానికి హారతి అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంది. భక్తులు జైజై వాసవాంబ అంటూ నినాదాలు చేశారు. తొమ్మిదేళ్ల బాలికలకు కన్యకాపూజ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి ఉయ్యాలోత్సవంతో కార్యక్రమాలు ముగిశాయి. ఇదే సందర్భంగా 2022-23, 2023-24 విద్యాసంవత్సరాలలో ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూసీలో 85శాతం కంటే ఎక్కువమార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసినట్టు ఆర్య వైశ్య మండలి ట్రస్టు అధ్యక్షుడు కేవీ వెంకటేశ్‌గుప్త తెలిపారు. మండలి కార్యదర్శి సనత్ కుమార్, టీఎస్ రాజేశ్, ఈఎస్ నాగేశ్, మహిళామండలి అధ్యక్షురాలు ఇంద్రాణి, కార్యదర్శి శ్వేతా, శృతి, కోశాధికారి రాధికా, కవితా ఇతర పదాధికారులు పాల్గొన్నారు.



కళశాల ఊరేగింపులో మహిళలు

చదువుకంటే సంస్కారం గొప్పది

బొమ్మనహళ్ళి, మే 31: చదువుకంటే సంస్కారం గొప్పదని ఎంత గొప్ప చదువులు చదివినా సంస్కారం లేకుంటే వ్యర్థమని డాక్టర్ రాజేశ్వర శివాచార్యస్వామిజీ అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని సీఎంఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం తరగతులను ప్రారంభించి మాటాడారు. ఇటీవలికాలంలో పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. కనీసం పరిజ్ఞానం లేకుండా పోతోందన్నారు. పిల్లల్లో ఈ తీరు మారేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అలాగే ఇందుకు తల్లిదండ్రులు కూడా ఆసక్తి చూపాలన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని వారు చక్కగా చదువుకుని ప్రయోజకులు అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు చదువుతోపాటు సంస్కారం నేర్పించాలన్నారు. పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎండీ పుష్పలత, సంపత్‌కుమార్, సంజయ్ గౌడ, మునిరాజ్, సునందరెడ్డి, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో తరగతులు ప్రారంభిస్తున్న స్వామిజీ తదితరులు

తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు ఆర్థిక చేయూత



పిల్లలతో వివిధ సంఘాల ప్రముఖులు

విజయపుర, మే 31: హాసన్ సమీపాన ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి పిల్లలకు ఆర్థిక చేయూత కల్పించారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర హోబళిలోని వెంకటగిరికోటె చెన్నకేశవస్వామి కల్యాణమండపంలో గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో మాదిగదండోరా సంఘం నేతృత్వంలో వివిధ సంఘాల ముఖ్యులు, తాలూకాలోని వివిధ మాదిగ సంఘాల ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లల్లో ధైర్యం నింపేలా భరోసా కల్పించారు. ఉన్నత లక్ష్యంతో విద్యలో రాణించాలని ఇందుకు తామంతా అండగా ఉంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే పిళ్ళమునిశామప్ప మాట్లాడుతూ ప్రమాదఘటన దురదృష్టకరమన్నారు. సామాజికవర్గంతో నిమిత్తం లేకుండా ఎవరైనాసరే కష్టంలో ఉంటే ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు సహృదయంతో మంచి అవకాశాలు కల్పించేలా చొరవ చూపాలన్నారు. 50 వేల రూపాయల చెక్కు అందచేశారు. దేవనహళ్ళి పురసభ మాజీ అధ్యక్షుడు ఎం నారాయణస్వామి మాట్లాడుతూ పిల్లల విద్యాభ్యాసానికి అవసరమైన అన్ని సహాయక చర్యలను ప్రభుత్వం తరఫున కల్పించడంతోపాటు వారికి అండగా ఉంటామన్నారు. గూడ్లు ముద్దేనహళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షుడు ఎం జగదీశ్ మాట్లాడుతూ మృతుల కుటుంబీకుల పరామర్శకు మంత్రి వస్తే జిల్లా యంత్రాంగం కూడా వస్తుందన్నారు. అప్పటికప్పుడు ప్రభుత్వం నుంచే లభించే సౌలభ్యాల గురించి తీర్మానం చేసే వీలుందన్నారు. మృతుల కుటుంబీకులకు తలా 2 ఎకరాల భూమి మంజూరు చేసేలా మంత్రిని కోరాలన్నారు. తాను వ్యక్తిగతంగా రూ.25వేలు ఇచ్చే హామీ ప్రకటించారు. పిల్లల బంధువులు ఒకరు మాట్లాడుతూ తాలూకాలోని కారహళ్ళి, హందరహళ్ళి గ్రామాలకు చెందినవారు మృతి చెందితే బాధిత పిల్లలను చిక్కబళ్లాపుర నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ పరామర్శించారన్నారు. అయితే దేవనహళ్ళి ఎమ్మెల్యే, మంత్రి అయిన కేహెచ్ మునియప్ప మాత్రం కనీసం ఫోన్‌ద్వారా కూడా పరామర్శించలేదని విచారం వ్యక్తం చేశారు. మాదిగ దండోరా రాష్ట్ర విభాగం ప్రచార సమితి అధ్యక్షుడు బుళ్ళహళ్ళి రాజప్ప మాట్లాడుతూ ఘటనపై మంత్రి పీఏకు వివరించామని అయితే స్పందన లేకపోయిందన్నారు. రెండుమూడు రోజుల్లో మంత్రి స్పందించి బాధిత కుటుంబాల పిల్లలను ఆదుకునేలా చొరవ చూపాలని లేనిపక్షంలో మంత్రి కార్యక్రమాలను ఘెరావ్ చేసి ప్రతిఘటన చేస్తామన్నారు. సమావేశంలో చొక్కనహళ్ళి చంద్రప్ప, మారప్ప, ముదుగుర్కి మూర్తి, న్యాయవాది ఎంఎం శ్రీనివాస్, కృష్ణమూర్తి, వెంకటేశ్ ప్రభు తదితర సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఆత్మహత్య



పీఎస్ గౌడర్ (ఫైల్)

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అకౌంటెంట్ చంద్రశేఖర్ ఆత్మహత్య మరువకముందే మరో దారుణం చోటు చేసుకుంది. చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వేధిస్తున్నారంటూ కర్ణాటక రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (కేఆర్ఐడీఎల్) అధికారులు వేధిస్తున్నారని దావణగెరె జిల్లా సంతెబెన్నూరు కంట్రాక్టర్ పీఎస్ గౌడర్ (48) ఆత్మహత్యకు పాల్పడ్డారు. డెత్‌నోట్‌లో కేఆర్ఐడీఎల్ అధికారులు వేధిస్తున్నారని జీర్ణించుకోలేకనే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు డెత్‌నోట్‌లో పేర్కొన్నారు. గౌడర్ సంతెబెన్నూరులోని ఇంట్లో ఈనెల 26న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంతెబెన్నూరు వ్యవసాయ శాఖ ప్రాంగణంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకుండా వేధిస్తున్నారంటూ డెత్‌నోట్‌లో పేర్కొన్నారు. ఇద్దరు సోదరులు కూడా ఆర్థిక పరమైన విషయాలలో మోసం చేశారని సోదరుడు శ్రీనివాస్ నాతోపాటు భార్యపైనా దాడి చేశారని రాశారు. కంట్రాక్టర్ పీఎస్ గౌడర్ భార్య వసంతకుమారి ఫిర్యాదు మేరకు సంతెబెన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అకౌంటెంట్ ఆత్మహత్యతోనే ప్రభుత్వం గిలగిలలాడుతోంది. ఏకంగా మంత్రి నాగేంద్ర రాజీనామాకు సీఎం సూచించినట్టు తెలుస్తోంది. ఇదే సమయంలోనే కాంట్రాక్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డం ప్రభుత్వానికి మరో షాక్ ఇచ్చినట్టయ్యింది. ఇందుకు సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బిజయేంద్ర నగరంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నో భాగ్యలను ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఉద్యోగులు, కంట్రాక్టర్లకు ఆత్మహత్యభాగ్య ఇచ్చిందని వ్యంగ్యం చేశా రు. కంట్రాక్టర్ ఆత్మహత్యకు నైతిక బాధ్యత వహిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంఖర్గేను మంత్రి వర్గం నుంచి తొలగించాలని సీఎం సిద్దరామయ్యను డిమాండ్ చేశారు.

సీబీఐ ముసుగులో విద్యార్థుల దోపిడీ

» నలుగురు కేరళ వాసులు అరెస్టు

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారుల ముసుగులో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు గంజాయి కేసులో ఉన్నావంటూ బెదరించి దోపిడీకి పాల్పడుతున్న కేరళ రాష్ట్ర ముఠాను సోలదేవనహళ్ళి పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకున్న గంటల వ్యవధిలోనే అరెస్టు చేశారు. తిరువనంతపురం హోటల్ యజమాని ఏఎస్ ప్రమోద్ (42), బెంగళూరులో చదువుతున్న విద్యార్థులు అనంతకృష్ణ (23), ఆదర్శ్ (22)తోపాటు మరో వ్యక్తి దీపక్ ఆర్ చంద్ర (37)ను అరెస్టు చేశారు. సోమవారం సంఘటన చోటు చేసుకోగా వెంటనే దాడి చేసి అరెస్టు చేశారు. హెసరఘట్ట మెయిన్‌రోడ్డులోని ఏజీబీ లే అవుట్‌లో ఉండే ముగ్గురు విద్యారులను దోపిడీ చేశారు. సీబీఐ అధికారులమంటూ విద్యార్థుల రూంలోకి దూసుకెళ్లి లాఠీలతో కొట్టారు. ఓ విద్యార్థి చేతికి గంజాయి ప్యాకెట్ ఇచ్చి వీడియో చేశారు. మీకు గంజాయితో సంబంధం ఉందని బెదరించారు. 3 లక్షల రూపాయలు నగదు ఇవ్వాలని లేదంటే డ్రగ్స్ పెడ్లర్‌గా భావించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ తర్వాత విద్యార్థులనుంచి 90వేల రూపాయలు తీసుకుని మిగిలిన మొత్తం ఇవ్వాలంటూ గడువు ఇచ్చారు. బాధిత విద్యార్థులు కేరళకు చెందినవారే. విద్యార్థులు ఫిర్యాదు చేసిన రోజే అరెస్టు చేశామన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి వారి నేరాలను గుర్తించామని గురువారం ప్రకటించారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మే 31: నిరుద్యోగ యువతీ, యువకులకు 'ఉన్నతి' ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లమా, డిగ్రీ చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. 35రోజుల పాటు బెంగుళూరులో శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.15 వేల కనీస వేతనంతో ఉద్యోగం కల్పిస్తామన్నారు. జూన్ 6వతేదీ నుంచి ప్రారరంభించే శిక్షణకు, పేర్ల నమోదు మరిన్ని వివరాలకు సెల్ నంబరు 90004 87423ను సంప్రదించాలని కోరారు.